రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:29 (బుధవారం సాయంత్రం) సహార్: 4:58 (గురువారం ఉదయం)

పలుమార్లు ఎమ్మెల్యేలు కోరినా స్పందించిన వైనం

పుంగనూరులో టీడీపీ కార్యకర్త హత్య ఘటనతో ఉలిక్కిపాటు

264 మంది
పోలీసుల బదిలీ



చిత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏకంగా 264 మంది పోలీసులు మంగళవారం బదిలీ అయ్యారు. ఈ స్థాయిలో బదిలీలు జిల్లా చరిత్రలో ఎన్నడూ జరగకపోవడంతో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వం మారాక కూడా జిల్లాలో వైసీపీ అనుకూల పోలీసులే ఆయా స్థానాల్లో పనిచేస్తున్నారని, పక్క మండలాలకు బదిలీ చేయమని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎస్పీ మణికంఠను పలుమార్లు కోరారు. ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. తాజాగా పుంగనూరులో టీడీపీ కార్యకర్త రామకృష్ణను వైసీపీ నేత వెంకట్రమణ అత్యంత దారుణంగా నరికి చంపాడు. మృతుడు రామకృష్ణ పాత వీడియో బయటపడడంతో పోలీసుల వైఫల్యం గురించి పైస్థాయి వరకు వెళ్లింది. ఇదంతా అప్పటి పోలీసుల్ని బదిలీ చేయక పోవడంతోనే అనే చర్చ మళ్లీ మొదటికొచ్చింది. మృతుడి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి.. ఎస్పీ మణికంఠపై సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ పోలీసుల్ని మార్చమని చెప్పినా ఎస్పీ పట్టించుకోక పోవడం వల్లే ఈ హత్య జరిగిందని, తాను కూడా ఎస్పీకు ఫోన్ చేయడం మానేశానని చెప్పారు. టీడీపీ కార్యకర్త హత్య జరగడం, అమర్నాథ్‌రెడ్డి ఎస్పీ మీద ఆగ్రహించడంతో అధికార పార్టీ నాయకులు, శ్రేణుల్లోని అసహనం బయటపడింది. దీంతో ఆ వీడియో వైరల్‌గా మారింది.

తీవ్ర చర్చనీయాంశమైన ఆంధ్రజ్యోతి కథనం

'ఇంకా వైసీపీ వీరవిధేయులే' శీర్షికన ఎక్కడెక్కడ వైసీపీ కోసం పనిచేసిన పోలీసులు ఇంకా కొనసాగుతున్నారనే సమగ్ర కథనం మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ కథనం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వైసీపీ కోసం పనిచేసిన వారిలో ఆందోళనను రేకెత్తించింది. ప్రభుత్వం నుంచి, ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిడితో ఇప్పటికే విమర్శల పాలయ్యామని గ్రహించిన ఎస్పీ మణికంఠ పెద్దఎత్తున బదిలీలు చేపట్టక తప్పలేదు.

బదిలీలపై పోలీసువర్గాల్లో తీవ్ర అసంతృప్తి

ఈ బదిలీలపై పోలీసువర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. గతంలో అనుసరించిన పద్ధతులపై చర్చ జరుగుతోంది. 'బదిలీల విషయాన్ని ముందుగానే ప్రకటిస్తారు. జిల్లా కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. పనిచేసే మండలం, సొంత మండలం కాకుండా వేరే మూడు మండలాలను ఎంచుకోవాలని ఆప్షన్ ఇస్తారు. వారు ఎంచుకున్న వరుస క్రమాన్ని బట్టి బదిలీ చేస్తారు' అని వారు పేర్కొంటున్నారు. ఇవేమీ పాటించకుండా.. కావాలనే దూర ప్రాంతాలకు బదిలీ చేసినట్లు స్పష్టమవుతోందని విమర్శిస్తున్నారు. 'పదో తరగతి పరీక్షలు, పాఠశాలలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసులు కూడా తమ పిల్లల కోసం కాస్త సమయాన్ని కేటాయించాల్సి వస్తోంది. వయసు పెరిగిన మరికొందరి ఆరోగ్యం దృష్టిలో పెట్టుకోవాలి. ఇలా దేన్నీ పరిగణనలోకి తీసుకోకుండా అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు ఇష్టానుసారంగా బదిలీ చేశారు. మరో కీలక విషయం ఏంటంటే, పుంగనూరు, సోమల, సదుం, కల్లూరు వంటి స్టేషన్లలో సిబ్బందిని పూర్తిగా బదిలీ చేసి, మొత్తం కొత్తవారిని నియమించారు. మొత్తం కొత్తవారైతే ఆయా ప్రాంతాలపై అవగాహన ఉండదని సగం మందికి మించకుండా బదిలీ చేస్తారు. దీన్నికూడా పాటించలేదు' అని పోలీసు వర్గాలు వాపోతున్నాయి.

ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేందుకే

జిల్లాలో పెద్దఎత్తున జరిగిన బదిలీలను చూస్తుంటే పోలీసులకు ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచేందుకే చేశారని స్పష్టంగా తెలుస్తోంది. అవే మండలాల్లో పనిచేస్తే వైసీపీ నాయకులకు ఇన్‌ఫార్మర్లుగా ఉంటారనే ఉద్దేశంతో పక్క మండలాలకు బదిలీ చేయమని కోరాం. ఇలా ఈ మూల నుంచి ఆ మూలకు విసిరేస్తారని అనుకోలేదు. దూర ప్రాంతాలకు బదిలీ అయిన వారికి ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగే అవకాశం ఉంది. సదుం నుంచి విజయపురం, కార్వేటినగరం, నగరి నుంచి రొంపిచెర్ల, పుంగనూరు నుంచి కార్వేటినగరం, చిత్తూరు, ఎస్‌ఆర్‌పేట నుంచి పుంగనూరు.. ఇలా బదిలీ చేయడం వెనుక అర్థమేంటి?

- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో

నిందితులకు రిమాండ్

పుంగనూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం కృష్ణాపురానికి చెందిన టీడీపీ కార్యకర్త కె.రామకృష్ణ హత్య కేసులో అరెస్టయిన ఇద్దరు నిందితులకు ఈనెల 27 తేదీ వరకు పుంగనూరు న్యాయమూర్తి వంశీకృష్ణ రిమాండుకు ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈనెల 15న రామకృష్ణ హత్యకు మూలకర్త ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు, వైసీపీ నాయకుడు ఎం.రెడ్డెప్పరెడ్డి, వేటకొడవలితో అతికిరాతకంగా నరికి హత్య చేసిన వైసీపీ కార్యకర్త కె.వెంకట్రమణ (34)లను సోమవారం పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు చేసినట్లు చిత్తూరు ఎస్పీ మణికంఠ వివరించారు. రిమాండ్‌కు ఆదేశించడంతో నిందితులను అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌జైలుకు తరలించినట్లు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తెలిపారు.

జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. వీరు డయాలసిస్ చేయించుకోవడానికి వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. వీరి కష్టాలను తప్పించడానికి నియోజకవర్గానికో డయాలసిస్ కేంద్రం అన్ని వసతులతో ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు విన్నవిస్తున్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనల తయారీపై వైద్యాధికారులు కసరత్తు మొదలుపెట్టారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే కిడ్నీ వ్యాధిగ్రస్తుల కష్టాలకు చెక్ పడనుంది.

- చిత్తూరు రూరల్, ఆంధ్రజ్యోతి



మంత్రి లోకేశ్ హామీతో బంగారుపాళ్యంలో ఏర్పాటైన డయాలసిస్ కేంద్రం

- ప్రతి నియోజకవర్గంలో డయాలసిస్ కేంద్రం అన్ని వసతులతో ఏర్పాటుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యేల వినతి
- ప్రతిపాదనలపై వైద్యాధికారుల కసరత్తు

కిడ్నీ వ్యాధిగ్రస్తుల
కష్టాలకు చెక్

జిల్లావ్యాప్తంగా కిడ్నీలు పాడై.. తప్పనిసరిగా డయాలసిస్ అవసరమైనవారు 759 మంది ఉన్నారు. వీరిలో కొందరికి నిత్యం, మరికొందరికి రెండు, మూడ్రోజులకు ఒకసారి డయాలసిస్ చేయాలి. గతంలో జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలోనూ పలువురు ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం లేక వ్యాధిగ్రస్తులు తిరుపతి, మదనపల్లె వంటి ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగానే డయాలసిస్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని వైద్యాధికారులకు సూచించారు.

లోకేశ్ హామీతో ఓ కేంద్రం ఏర్పాటు

యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే బంగారుపాళ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేశారు.

759 మందికి 42 యంత్రాలు

759 మంది బాధితులు ఉంటే అందుకు తగ్గట్టుగా డయాలసిస్ యంత్రాలు లేకపోవడంతో పక్క జిల్లాలైన తిరుపతి, మదనపల్లె, ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. జిల్లాలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో 12, కుప్పంలో 9, పుంగనూరులో 11, నగరిలో 5, బంగారుపాళ్యం 5 కలిపి మొత్తం 42 డయాలసిస్ యంత్రాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఒక్కో కేంద్రంలో 50 మందికిపైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండాల్సి వస్తోంది. అందువల్ల ఈ కేంద్రాలనూ కూడా సమగ్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

రెండు నియోజకవర్గాల్లో కేంద్రాలు లేవు

జిల్లాలోని జీడీనెల్లూరు, పలమనేరులో డయాలసిస్ కేంద్రాలు లేవు. ఇక్కడి బాధితులు బంగారుపాళ్యం, చిత్తూరు, తిరుపతిలోని డయాలసిస్ కేంద్రాలకు వెళుతున్నారు.

సీఎంను కోరిన ఎమ్మెల్యే థామస్

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జీడీనెల్లూరులో వైద్యసేవలకు, డయాలసిస్ కోసం బాధితులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. ఇదే విషయాన్ని ఇటీవల జీడీనెల్లూరు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. జీడీ నెల్లూరులోనే వంద పడకల ఆస్పత్రితోపాటు డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించడంతో కావాల్సిన ప్రతిపాదనలు కూడా పంపించామన్నారు. ఇదే విషయాన్ని అసెంబ్లీలో కూడా ఆయన ప్రస్తావించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- 316 గ్రాముల బంగారం, 3.150 కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాల సీజ్



నిందితులు, బంగారం, వెండి వస్తువులను మీడియాకు చూపిస్తున్న ఎస్పీ మణికంఠ


చిత్తూరు అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారం, వెండి వస్తువులు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పోలీసు అతిథి గృహంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, సీఐ కృష్ణమోహన్‌లతో కలిసి వివరాలను ఎస్పీ మణికంఠ మీడియాకు తెలిపారు. ఈనెల ఆరో తేదీన పూతలపట్టు మండలంలో జరిగిన ద్విచక్రవాహన దొంగతనం కేసులో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 17వ తేదీన పోలీసులకు వచ్చిన సమాచారంతో పూతలపట్టు మండలం పి.కొత్తకోట రోడ్డు వద్ద తవణంపల్లె మండలం జెట్టిపల్లెకు చెందిన గల్లా హేమచంద్ర(27), ప్రకాశం జిల్లా కొండరాజుపల్లెకు చెందిన కొండరాజు సురేష్(27), తిరుపతి జిల్లా పుత్తూరు టౌన్ పరిధిలోని కామరాజనగర్‌కు చెందిన షేక్ మస్తాన్(24), సత్యసాయి జిల్లా ఒడిసి మండలం మిట్టపల్లెకు చెందిన పోలి వరప్రసాద్(20), చిత్తూరు మండలం తాళంబేడుకు చెందిన సంజయ్ కుమార్(23)లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2.30 లక్షల విలువ చేసే రెండు ద్విచక్ర వాహనాలు, రూ.25.28 లక్షల విలువ చేసే 316 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3.50లక్షల విలువ చేసే 3 కిలోల 150 గ్రాముల వెండి వస్తువులు, రూ.20వేలు విలువ చేసే ఎల్‌ఈడీ టీవీని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

జల్సాలకు అలవాటుపడటం వల్లే..

యుక్త వయస్సులో ఉన్న వీరంతా జల్సాలకు అలవాటుపడటం వల్లే దొంగతనాలు చేయడం మొదలుపెట్టారని పోలీసులు తెలిపారు. మన రాష్ట్రంతోపాటు తమిళనాడు, కర్ణాటకల్లో కూడా చోరీలు చేశారు. ఒంటరి మహిళల మెడలో బంగారు చైన్లను లాక్కెళ్లడం, ఇళ్లలో చోరీలు చేయడం, ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లడం, ఆలయాల్లో హుండీలను పగలగొట్టి చోరీలకు పాల్పడేవారని వివరించారు.

వయస్సు 27.. కేసులు 60

ఏ-1 నిందితుడు హేమచంద్ర వయస్సు 27 కాగా ఇతడిపై మొత్తం 60 కేసులుండగా.. 20 వారెంట్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ-2గా ఉన్న కొండరాజు సురేష్‌పై 27 కేసులు, ఏ-3 షేక్ మస్తాన్‌పై 57 కేసులు నమోదయ్యాయి. ఏ-4గా ఉన్న పోలి వరప్రసాద్‌పై ఒక కేసు నమోదై ఉండగా... ఏ-5 సంజయ్ కుమార్‌పై ఇదే మొదటి కేసుగా నమోదైంది.



భానుడి దెబ్బకు జనం ఉక్కిరిబిక్కిరి

- గుడిపాలలో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భానుడు నిప్పులు కక్కుతుండటంతో జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రతను తట్టుకోలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గుడిపాల మండలంలో అత్యధికంగా 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాలవారీగా.. నిండ్రలో 39.3, తవణంపల్లెలో 39, పులిచెర్లలో 38.3, గుడుపల్లెలో 38.2, శ్రీరంగరాజపురంలో 38.1, గంగవరం, నగరిలో 37.8, పలమనేరు, శాంతిపురంలో 37.6, సోమలలో 37.5, సదుంలో 37.2, రొంపిచెర్లలో 37.1, పెద్దపంజాణిలో 37, చౌడేపల్లె, విజయపురం, ఐరాల, పాలసముద్రంలో 36.7, బంగారుపాళ్యంలో 36.5, చిత్తూరులో 36.4, వి.కోటలో 36.2, వెదురుకుప్పంలో 36, పెనుమూరులో 35.6, గంగాధరనెల్లూరులో 35.4, కుప్పం, పూతలపట్టులో 35.2, బైరెడ్డిపల్లె, యాదమరిలో 34.8, రామకుప్పంలో 34.4, కార్వేటినగరం, పుంగనూరులో 34.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కరోనాతో మృతి చెందిన వారి పేర్లు

తొలగించేదెప్పుడు?

- ఇలాగైతే నాణ్యమైన ఓటరు జాబితా ఎలా తయారవుతుంది
- రాజకీయ పార్టీల ప్రతినిధులు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'కరోనా కారణంగా 2019లో మృతి చెందిన వారి పేర్లు సైతం ఇప్పటికీ ఓటరు జాబితాలో ఉన్నాయి. ఇలాగైతే నాణ్యమైన ఓటరు జాబితా ఎలా తయారు చేస్తారు' అని రాజకీయ పార్టీల ప్రతినిధులు విమర్శించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ) తదితరులు మాట్లాడుతూ.. మృతుల పేర్లను బీఎల్వోలు ఎప్పటికప్పుడు తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఆధార్ కార్డుతో ఓటరు కార్డును అనుసంధానం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. చాలామంది పేర్లు రెండు మూడు నియోజకవర్గాల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. ఒకే డోర్ నెంబర్‌లోని ఓటర్ల పేర్లు వేర్వేరు పేజీల్లో ఉంటున్నాయని తెలిపారు. డీఆర్వో మోహన్ కుమార్ మాట్లాడుతూ.. పారదర్శక ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీల సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం ఆర్డీవోలు శ్రీనివాసులు, భవాని, భవానీశంకరి, శ్రీనివాసులుతోపాటు వివిధ పార్టీల ప్రతినిధులు దేవినేని యశ్వంత్ (జనసేన), ఉదయ్ కుమార్ (వైసీపీ), బాలసుబ్రహ్మణ్యం (ఆమ్‌ఆద్మీపార్టీ), లోకనాథం (బీఎస్పీ), గంగరాజు (సీపీఐ), పరదేశి (కాంగ్రెస్), ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ వాసుదేవన్, వివిధ నియోజకవర్గాల డీటీలు పాల్గొన్నారు.

ఇంకా జగనన్నేనా?

గుడిపాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారి పది నెలలు అవుతున్నా గుడిపాల మండలంలోని మరకాలకుప్పం పంచాయతీ దక్షిణ బ్రాహ్మణపల్లె ఎలిమెంటరీ స్కూల్ బోర్డులో మాత్రం జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యా కానుక కిట్లు అనే ఉంది. ఈ బోర్డును ఇంకెప్పుడు మారుస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



దక్షిణ బ్రాహ్మణపల్లె ఎలిమెంటరీ స్కూల్ బోర్డు

ఒంటరి ఏనుగు జాడ కోసం..

డ్రోన్ కెమెరాతో గాలింపు

కల్లూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న ఒంటరి ఏనుగు జాడ కోసం మంగళవారం అటవీ ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎఫ్ఎస్‌వో మహ్మద్‌షఫి తెలిపారు. మండలంలోని పాళెం, కల్లూరు, పాతపేట, దేవళంపేట పంచాయతీల్లోని పంటలను ఇటీవల ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో ఎఫ్‌ఆర్‌వో థామస్ సుకుమార్ ఒంటరి ఏనుగు ఆచూకీ గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. పాళెం, దేవళంపేట పంచాయతీ సరిహద్దులోని తూర్పు విభాగం అటవీప్రాంతంలోని చింతలవంక, సూరప్పచెరువు వద్ద డ్రోన్ కెమెరాతో గాలింపు చేపట్టారు. అయితే అటవీ ప్రాంతంలో దట్టమైన చెట్లు ఉండటంతో డ్రోన్ కెమెరాకు ఒంటరి ఏనుగు జాడ తెలియలేదు.



డ్రోన్ కెమెరాతో గాలిస్తున్న అటవీశాఖ అధికారులు



అన్నప్రసాదం ట్రస్టుకు రూ.పది లక్షలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందిస్తున్న తిరుపతికి చెందిన కేపీస్సీ టాకీస్ చైర్మన్ కేతన్ శివ ప్రీతమ్


ఆరుగురు ఇరిగేషన్ డీఈలకు పదోన్నతిపై బదిలీలు

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఆరుగురు డీఈలను ప్రభుత్వం తాత్కాలిక ప్రాతిపదికన ఈఈలుగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేసింది. పిచ్చాటూరు ఇరిగేషన్ డీఈ జి.రామచంద్రమూర్తిని సోమశిల లింక్ కెనాల్ అండ్ స్వర్ణముఖి బ్యారేజీ నెల్లూరు డివిజన్1కు ఈఈగా బదిలీ చేసింది. తెలుగుగంగ ప్రాజెక్టు వెంకటగిరి డీఈ ఎం.బాబురెడ్డిని వెంకటగిరి ఇరిగేషన్‌కు.. టీజీపీ నాయుడుపేట డీఈ సి.సి.రాజశేఖర్‌రెడ్డిని సోమశిల ప్రాజెక్టు ఆత్మకూరు డివిజన్ 4కు.. టీజీపీ డిజైన్స్ విభాగం తిరుపతి డీఈ పి.చంద్రశేఖరయ్యను అదే ప్రాజెక్టులో క్వాలిటీ కంట్రోల్ శ్రీకాళహస్తి డివిజన్ 3కి.. టీజీపీ బీఎన్ కండ్రిగ డీఈ బి.పెంచలయ్యను అనంతపురంలోని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ డివిజన్‌కు.. సోమశిల లింక్ కెనాల్ స్వర్ణముఖి బ్యారేజీ గూడూరు డీఈ పావులూరి చంద్రమోహన్ గాలేరు-నగరి ప్రాజెక్టు జమ్మలమడుగు డివిజన్4కు ఈఈగా బదిలీ చేశారు. చిత్తూరు వాటర్ సప్లై డీఈ జేవీ శివారెడ్డి శ్రీకాళహస్తి ఈఈగా బదిలీ అయ్యారు.

భర్త, ప్రియురాలికి పదేళ్ల జైలు

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్త, అతని ప్రియురాలికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. పాతవేపకుప్పం గ్రామానికి చెందిన మమత, గోపి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. అయితే గోపి అదే గ్రామానికి చెందిన భారతితో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యతో గొడవ పడేవాడు. ఈనేపథ్యంలో ఆమె 2018 ఫిబ్రవరి 19న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి ఎస్ఐ భాస్కర్ నాయక్ కేసు నమోదు చేశారు. అనంతరం వచ్చిన ఎస్ఐ సాదిక్ ఆలీ విచారణ వేగవంతం చేశారు. గోపి, భారతి చర్యల వల్ల మమత ఆత్మహత్యకు పాల్పడిందని న్యాయమూర్తి గురునాథ్ పేర్కొంటూ వారిద్దరికీ పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.84 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,824
తలనీలాలు సమర్పించినవారు: 25,674



శ్రీవారి ఆలయం ముందు పలచగా ఉన్న భక్తులు

రుయాలో చెట్ల కింద సేదతీరుతూ..

తిరుమలలో..

నిర్మానుష్యంగా తిరుపతిలోని బాలాజీ కాలనీ సర్కిల్

మార్చి.. అప్పుడే మాడ్చి

- నిప్పులు చెరుగుతున్న సూర్యుడు
- అల్లాడిపోతున్న ప్రజానీకం

ఈ ఏడాది సూరీడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మార్చిలోనే ప్రతాపం చాటుతున్నాడు. సాధారణంగా మేనెలలో 40 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరేది. అలాంటిది మంగళవారం ఆమేరకు చేరుకోవడంతో జిల్లా ప్రజానీకం బెంబెలెత్తుతున్నారు. తిరుమలేశుడి దర్శనానికి తిరుపతి చేరుకునే భక్తులు అల్లాడిపోతున్నారు. ఇక, తిరుపతిలో ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోడ్లపై జనసంచారం పలచగా ఉంటోంది. అమ్మకాలు సాగడంలేదని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు ప్రాంగణంలోని చెట్లనీడలో సేదతీరుతూ కనిపిస్తున్నారు. రూయా, మెటర్నరీ వైద్యశాలల వద్ద రోగులు,వారి బంధువులు చెమటలు కక్కుతూ నీడకోసం వెంపర్లాడుతున్నారు. పాదచారులు, ద్విచక్రవాహనదారులు, చిరు వ్యాపారులకు గరుడవారధి గొడుగులా మారింది. మరోపక్క ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నాపెద్దా తక్షణ ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లకు క్యూ కడుతున్నారు. కర్బూజా అమ్మకాలు జోరందుకున్నాయి. ఇళ్లలో ఫ్రిజ్‌లున్నా సహజమైన చల్లదనం కోసం జనం కుండలపై ఆసక్తి చూపిస్తున్నారు. తిరుమల కొండ మీద భక్తులు ఎండవేడిమికి తాళలేక మాడవీధుల నుంచి నీడ కోసం పరుగులు తీస్తున్నారు.

- తిరుపతి(లీలామహల్), ఆంధ్రజ్యోతి

ఎండలతో జాగ్రత్త



వడదెబ్బ అవగాహన పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. వడదెబ్బ అవగాహన బ్యానర్లు, పోస్టర్లను మంగళవారం ఆయన తిరుపతిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో అవసరమైతే తప్ప ఎండలో బయటకు రాకూడదన్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎండ నుంచి రక్షణగా టోపీ, గొడుగులు వంటివి వాడాలన్నారు. నీటితో పాటు పళ్ల రసాలు వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వడదెబ్బగా గుర్తించి.. సమీప ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో శాంతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో మురళీకృష్ణ, జిల్లా మలేరియా అధికారి రూప్‌కుమార్, వైద్యాధికారులు మధుబాబు, లావణ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరి మృతి



చెంగల్రాయులు (ఫైల్ ఫొటో)

రామచంద్రాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం గంగిరెడ్డిపల్లెలో వడదెబ్బకు పూజారి చెంగల్రాయులు(65) మృతిచెందారు.మంగళవారం ఉదయం 10గంటలకు పొలం వద్దకు వెళ్లిన ఆయన.. మధ్యాహ్నం 12గంటలకు ఇంటికి వచ్చారు. గుండె నొప్పిగా ఉందంటూ కుప్పకూలారు. 108 వాహనం ద్వారా తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. వడదెబ్బ వల్లే మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అద్దెకు కారు తీసుకుని.. ఉడాయించిన ఘనుడు

- అరెస్టు చేసిన పోలీసులు
- మూడు కార్లు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): అద్దెకు కారు తీసుకున్నాడు. ఐదు రోజులు తిరిగి.. ఆపై ఉడాయించాడు. చివరకు ఇతడిని మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఇతడి నుంచి మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, చిన్న మిరానికి చెందిన మహేష్ నూతన కుమార్.. నకిలీ ఆధార్ కార్డు చూపించి ఈనెల 11న తిరుపతిలో ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. ఐదు రోజుల పాటు కారును వాడుకున్న తర్వాత.. కర్నూలు జిల్లా దాటి తెలంగాణ సరిహద్దుకు చేరుకున్నాడు. అక్కడ కారుకు ఉన్న జీపీఆర్ఎస్ వైర్లు తొలగించాడు. తన మొబైల్ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. దీనిపై బాధితుడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రాంకిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ లోకేష్‌బాబు, సిబ్బంది కలిసి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. తిరుపతి జూ పార్కు రోడ్డులో వున్నట్లు గుగూల్ మ్యాప్ ద్వారా మంగళవారం గుర్తించి అతడిని అరెస్టు చేశారు. గతంలో జైపూర్, ఢిల్లీ ప్రాంతాల్లో జూమ్ కార్లు అద్దెకు తీసుకుని ఉడాయించినట్లు గుర్తించారు. ఇతడిపై కోల్‌కత్తా, ఢిల్లీ, హైదరాబాదు, చెన్నై, భీమవరం, ముంబై నగరాల్లో మొత్తం 24 కేసులు నమోదైనట్లు గుర్తించారు. గతంలో ఐదుసార్లు జైలు శిక్ష అనుభవించాడు. నిందితుడి జైపూర్, ఢిల్లీ, తిరుపతికి చెందిన మూడు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారి బదిలీ

తిరుపతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి దేవస్థానాలలో తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా పనిచేస్తున్న జి.గుణభూషణ్ రెడ్డి బదిలీ అయ్యారు. రెవిన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఆయన గతేడాది జనవరి 10వ తేదీన దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ అయి టీటీడీ తిరుపతి ఎస్టేట్స్ అధికారిగా నియమితులయ్యారు. తాజాగా ప్రభుత్వం ఆయనను టీటీడీ నుంచీ బదిలీ చేసి కర్నూలు జిల్లా బీజీ రైల్వే విభాగం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జరిమానా లేదా జైలుకు పంపండి

- నాటుసారా నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్ ఆదేశం



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయా తహసీల్దార్లు నాటుసారా నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.లక్ష జరిమానా లేదా జైలుశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నాటుసారా నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవోదయం 2.0' పోస్టర్లను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించి.. జిల్లా ఎక్సైజ్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, పంచాయతీ, అటవీ, వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ శాఖల అధికారులు మండల.. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచడానికి గ్రామసభలు నిర్వహించాలన్నారు. రాబోయే మూడు నెలల్లో తిరుపతిని నాటు సారా రహిత జిల్లాగా తయారు చేయడానికి కృషి చేస్తామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో నిందితులకు పునరావాసం కల్పించి పరివర్తన తీసుకొస్తామని ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ చెప్పారు. నేరస్థులపై పీడీయాక్ట్ పెట్టి సారా వృత్తి నుంచి బయటపడేలా చర్యలు తీసుకుంటామని ఏసీ శ్రీనివాసాచారి చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఈఎస్ నాగమల్లీశ్వరరెడ్డి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్ భూసేకరణ పురోగతి పనులపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్‌గా అధికారులతో సమీక్షించారు.

తిరుమలలో సాధువుల ధర్నాపై పోలీసులు సీరియస్

- 118 మందిపై కేసులు నమోదు
- పునరావృతం కాకుండా చట్టాల కఠినతరానికి నిర్ణయం

తిరుమల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా సాధువులు ధర్నాకు దిగడంపై పోలీసులు సీరియస్ అయ్యారు. ముందస్తుగా నోటీసులు జారీ చేసినప్పటికీ ఆలయ చట్టాలకు వ్యతిరేకంగా శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన 118 మందిపై బీఎన్ఎస్ ప్రివెంట్ అరెస్ట్ సెక్షన్ 151 కింద కేసులు నమోదు చేశారు. అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన జీవో నెంబరు 24ను రద్దు చేసి ఆ స్థలాన్ని భక్తుల సౌకర్యార్థం కేటాయించాలనే డిమాండ్‌తో ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానందస్వామి ఆధ్వర్యంలో పలు రాష్ట్రాలకు చెందిన సాధువులు, బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, ఆయన అనుచరులు సోమవారం శ్రీవారి ఆలయం ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ధర్నాలో పాల్గొన్న 118 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై పంపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా ఆలయ చట్టాలను మరింత కఠినతరం చేయాలని పోలీసులు భావిస్తున్నారు. భక్తులను భయభ్రాంతులకు గురిచేయడంతోపాటు విధుల్లోని సిబ్బందికి ఆటంకం కలిగించేలా వ్యవహరించే వ్యక్తులపై ఇకపై కఠినమైన చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. ఈ అంశాన్ని తేలికగా తీసుకుంటే భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని చోటుచేసుకునే అవకాశముందనే అంచనాతో ఆలయ చట్టాలను కఠినంగా అమలుచేయాలని భావిస్తున్నారు. కాగా, ఆదర్శంగా ఉండాల్సిన సాధువులే అల్లర్లు చేస్తే ఎలా? అని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తిరుమలలో నిరసనకు దిగడం అపచారమని సాధువులకు తెలియదా? అని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎండ తీవ్రత దృష్ట్యా ఇకపై గంట ముందే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, మండలకేంద్రాల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ఎండల తీవ్రత దృష్ట్యా ఒక గంట ముందే నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతుందని పేర్కొన్నారు.

శ్రీసిటీలో నేషనల్ డిఫెన్సు కళాశాల అధికారుల పర్యటన

శ్రీసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భారతదేశ పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్సు కళాశాలకు చెందిన 17మంది సభ్యుల బృందం మంగళవారం శ్రీసిటీలో పర్యటించింది. మేజర్ సి.పి.సంగ్రా నేతృత్వంలో భారత సాయుధ దళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో విచ్చేశారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ, లాజిస్టిక్స్, ఏరో స్పేస్, డిఫెన్సు రంగాల్లో భాగస్వామ్యం గురించి వారికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వివరించారు. శ్రీసిటీ తర్వాత ఈ ప్రాంతంలో వచ్చిన మార్పులనూ తెలియజేశారు. శ్రీసిటీ పారిశ్రామిక విధానం, సులభతర వ్యాపారం, లాజిస్టిక్స్ సామర్థ్యం, సామాజిక వసతులు, భద్రత తదితర అంశాలపై ప్రతినిధి బృందం చర్చించింది. వికసిత్ భారత్ లక్ష్యంగా శ్రీసిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, క్రమశిక్షణ అద్భుతమంటూ టీం లీడర్ ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ పర్యటన కోఆర్డినేటర్లుగా మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ శ్రీనివాసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



శ్రీసిటీ గురించి వివరిస్తున్న ఎండీ రవీంద్రసన్నారెడ్డి

భక్తుల రక్షణ కోసం..

- తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు

తిరుమల, మార్చి18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కాలంచెల్లిన సిల్వర్‌ఓక్ వృక్షాల తొలగింపు ప్రక్రియ మొదలైంది. ప్రధాన ఉద్యానవనాల్లో నీడ కోసం సిల్వర్‌ఓక్ వృక్షాలను టీటీడీ 1980లో ఏర్పాటు చేసింది. వీటి కాలపరిమితి 30 ఏళ్లు. ప్రస్తుతం తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఈ వృక్షాలు చిన్నపాటి గాలులు, వర్షాలతో నేలకూలుతున్నాయి. ఇప్పటివరకు కూలినచెట్ల కారణంగా అనేక వాహనాలు, నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో భక్తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని జనసంచారంలో ఉండే కాలం చెల్లిన సిల్వర్‌ఓక్ చెట్లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఫారెస్ట్ విభాగాన్ని ఆదేశించారు. వీరు 839 కాలంచెల్లిన వృక్షాలను గుర్తించారు. కూలిపోయే స్థితిలో ఉన్నట్టు నిర్ధారించారు. వీటి కొమ్మలు, ఆకులు నిత్యం పడుతుండటంతో విశ్రాంతి భవనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నట్టు నివేదికలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొదలైన వీటి తొలగింపు పనులు.. మూడునెలల్లో పూర్తికానున్నాయి. వాటి స్థానంలో దాదాపు 40 రకాల పూలు, పండ్లు, నీడనిచ్చే చెట్లను నాటాలని ఫారెస్ట్ అధికారులు ప్రణాళికలు రూపొందించుకున్నారు.



తిరుమలలో తొలగించిన సిల్వర్‌ఓక్ వృక్షాలు

అడవుల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యం



స్వయం రక్షణ పరికరాలు పంపిణీ చేస్తున్న డీఎఫ్‌వో భరణి తదితరులు

కుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అడవులను పరిరక్షిస్తే పర్యావరణ సమతుల్యం ఏర్పడి మానవాళి సుఖసంతోషాలతో జీవించగలదని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి అన్నారు. కుప్పం అటవీశాఖ కార్యాలయంలో వివిధ కేటగిరీలకు చెందిన అటవీ సిబ్బందికి యూనిఫాం, షూలు, బెల్టులు, టోపీలు, టార్చిలైట్లు, అగ్ని నిరోధక యంత్రాలు వంటి స్వయం రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కఠినమైన విధి నిర్వహణను చిత్తశుద్ధితో చేస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో కుప్పం అటవీ క్షేత్రాధికారి ఆర్.జయశంకర్, డీఆర్వోలు పుల్లయ్య, షమీర్ బాషా, అనిమల్ ట్రాకర్లు, బేస్ క్యాంప్ వాచర్లు, చెక్‌పోస్టు సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు వెయ్యి రోజుల ప్రణాళికలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి వెయ్యి రోజుల పాటు పర్యవేక్షిస్తూ వైద్య సేవలందిస్తే మాతాశిశు మరణాలు ఉండవని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. మంగళవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు 100 శాతం రోగ నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఎన్‌సీడీ స్ర్కీనింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత విద్యుత్'పై మరమగ్గ, చేనేత కార్మికుల హర్షం



చంద్రబాబు, భానుప్రకాష్ చిత్రపటాలకు పాలాభిషేకం

నగరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడంపై మరమగ్గ, చేనేత కార్మికులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట అగర్వాల్ వినాయక స్వామి ఆలయం వద్ద కార్మికులతో కలిసి టీడీపీ నాయకులు బాణసంచా పేలుస్తూ, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే భానుప్రకాష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. గతంలో ఎవరూ చేయని విధంగా ఎమ్మెల్యే భానుప్రకాష్.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ల దృష్టికి తీసుకెళ్లి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించారని కొనియాడారు. ఇప్పటికే కొన్ని మరమగ్గాలు మూతకు గురయ్యాయని, ఇలాంటి సమయంలో 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ ప్రకటించి మరమగ్గ, చేనేత కార్మికుల జీవితాలకు వెలుగునిచ్చారన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్ బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు కృష్ణారెడ్డి, జ్యోతినాయుడు, వీకేఎస్ వాసు, ఆర్ముగం, రజనీకాంత్, కరుణ, మదివాసన్, మాణిక్యవాసన్, కరుణ, దయాలన్, మొదలియార్లు, మరమగ్గ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

బీపీఎల్ కుటుంబాల ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో 2019 అక్టోబరు 15 నాటి గ్రామీణ ప్రాంతాల్లో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలు నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించినట్లు డీఆర్వో మోహన్ కుమార్ తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. దీనికోసం ప్రభుత్వం జీవో నెం.30ని జారీ చేసిందన్నారు. ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్ల తరబడి నివాసముంటున్న కుటుంబాలను అధికారులు గుర్తిస్తున్నట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాలకు అధికారికంగా కన్వేయన్స్ డీడ్ మంజూరు చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. అర్హులకు 150 గజాల్లోపు డీ-పట్టా జారీ చేస్తామని, రెండేళ్ల తర్వాత ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. పదేళ్ల కాలపరిమితితో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించేలా కన్వేయన్స్ డీడ్ ఇస్తామన్నారు. 151 గజాలకు పైన ఉంటే, ఆ లబ్ధిదారుడికి ప్రాథమిక భూమి విలువలో నిబంధనల ప్రకారం నిర్ణీత ధరకు కేటాయిస్తామన్నారు. రెండు నెలల్లో నగదు ప్రభుత్వానికి చెల్లిస్తే లబ్ధిదారుడి పేరిట కేటాయిస్తామన్నారు. లబ్ధిదారుడి కుటుంబంలో ఏ ఒక్కరికి రాష్ట్రంలో ఎక్కడా సొంత ఇంటి స్థలం, ఇల్లు ఉండకూడదన్నారు. అలాగే గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గృహనిర్మాణ పథకాల్లో లబ్ధిదారుడిగా ఉండకూడదని పేర్కొన్నారు. కుటుంబంలోని మహిళ మాత్రమే క్రమబద్ధీకరణకు అర్హులుగా గుర్తిస్తామని తెలిపారు. దరఖాస్తు చేయనివాటిని అక్రమంగా గుర్తించి తొలగిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో అవసరమైన పత్రాలు జతపరచి దరఖాస్తులు అందిస్తే, వాటిపై వీఆర్వో, తహసీల్దార్, ఆర్డీవో విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తారన్నారు. కలెక్టర్ అధ్యక్షతన ఉన్న జిల్లా అధికారిక కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇప్పటివరకు 14 దరఖాస్తులు అందగా, వీఆర్వోలు పరిశీలిస్తున్నట్లు వివరించారు.

హరేకృష్ణ శతపతికి రాష్ట్రీయ పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సంస్కృత వర్సిటీ మాజీ వీసీ హరేకృష్ణ శతపతి శ్రీభాష్యం పార్థసారథి రాష్ట్రీయ పురస్కారాన్ని పొందారు. సంస్కృత సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా హైదరాబాదులోని సంస్కృత అకాడమీ ఈ పురస్కారాన్ని అందించింది. పలువురు ఆయన్ను అభినందించారు.




సోమలలో ఉదయం కురుస్తున్న మంచు - మధ్యాహ్నం ఎండ తీవ్రతతో బోసిపోయిన సోమల బస్టాండు

మంచుటెండ..!

సోమల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉదయం దట్టమైన పొగమంచు.. 11 గంటలకే ఎండ సెగలతో ఉష్ణోగ్రతల్లో అనూహ్య మార్పులతో పల్లె వాసులు ఇబ్బందులు పడుతున్నారు. రెండ్రోజులుగా సోమలలో 37 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రత నమోదవుతోంది. గత ఏడాది ఏప్రిల్, మే నెలల్లో 36 డిగ్రీలుండగా, ప్రస్తుతం మార్చిలోనే 37 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. ఈ వాతావరణ ప్రభావంతో టమోటా సాగుకు ఇబ్బందిగా మారిందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక అటవీ శివారు గ్రామాల్లో ఉదయం మంచు ప్రభావం అధికంగా ఉంది.

కుప్పం తాగునీటి సమస్య తీరుతోంది !

- రూ.1.69 కోట్లతో టెండర్లు ఫైనల్
- బోర్ల తవ్వకం, ఇతర తాగునీటి సరఫరా పనులకు శ్రీకారం




కుప్పంలో బోరుబావి తవ్వకానికి సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది - నూతన తాగునీటి పైపులైన్ ఏర్పాటు

కుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మార్చి మధ్యలోనే ఎండలు మండిపోతున్నాయి. ఒక్కో బోరుబావిలో జలం అడుగంటుతూ వస్తోంది. పైపులైన్ల మరమ్మతులు పెండింగులో ఉండగా, కొన్ని బోర్లకు మోటార్ల బిగింపు జరగలేదు. కొత్త పైపులైన్లు వేయాల్సిన ప్రాంతాలు మిగిలే ఉన్నాయి. మెల్లగా ప్రజలు దాహంతో అల్లాడిపోవడం ప్రారంభమవుతున్నవేళ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంది. కుప్పం పురపాలక సంఘం పరిధిలో తాగునీటి సరఫరాకోసం ఏకంగా రూ.1.69 కోట్లతో టెండర్లు ఫైనల్ అయ్యాయి. బోర్ల తవ్వకాలకోసం ప్రాంతాలను గుర్తిస్తుండగా, మరోవైపు పైపులైన్ల ఏర్పాటు మొదలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేసిన నిధుల సద్వినియోగానికి మున్సిపల్ అధికారులు వేగంగా చర్యలు చేపట్టారు.

కుప్పం పురపాలక సంఘంలో తాగునీటి సరఫరా కోసం నిజానికి రూ.1.69 కోట్లతో గతేడాది చివరిలోనే టెండర్లు పిలిచారు. మొత్తం 32 పనులకు కలిపి పిలిచిన ఈ టెండర్లు ఇప్పుడు ఫైనల్ అయ్యాయి. ప్రస్తుతం అధికారులు ఆయా పనులను అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. కుప్పం మున్సిపాలిటీకి పీవీసీ పైపులు, ఎంటీయే, బెండ్స్, గేట్ వాల్వ్ వంటి నీటి సరఫరా నిర్వహణ మెటీరియల్‌కు రూ.4,17,625 టెండర్లు ఓకే చేశారు. 13వ వార్డు సంపంగి నగర్, 21వ వార్డు లక్ష్మీ థియేటర్ వెనుకవైపు నూతన తాగునీటి బోరు తవ్వకాలకు (ఒక్కో పనికి రూ.2,47,363) టెండర్లు ఫైనల్ చేశారు. 21వ వార్డు లక్ష్మీపురం వెనుకవైపున, బోరుబావి ఫిక్సింగ్ మెటీరియల్ కోసం (రూ.3,92,704) టెండర్లు ఖరారు చేశారు. ఒకటి నుంచి 12 వార్డుల దాకా బోరు మోటార్ల మరమ్మతులు, రివైండింగ్ పనులు (రూ.4,21,770), 13 నుంచి 25 వార్డులకు బోరు మోటార్ల మరమ్మతులు, రివైండింగ్ వర్క్స్ (రూ.4,21,770), 1, 3, 4, 7, 9, 10, 11, 12, 16, 17, 19, 20, 21, 22, వార్డులో కొత్త బోరుబావి తవ్వకంతోపాటు బోర్ల యాక్సెరీస్‌లు (ఒక్కో పనికి రూ.6,55,169) లక్షలకు టెండర్లు ఓకే చేశారు. పారిశుధ్య సిబ్బందికి కోకోనట్ ఆయిల్, రిన్ సోపులు సరఫరా (రూ.4,21,512), 13వ వార్డు సంపంగి నగర్, 21వ వార్డు ఆర్వీఎం వీధులలో నూతన బోరుబావుల తవ్వకాలకు (ఒక్కో పనికి రూ.2,47,363) టెండర్లు ఫైనల్ చేశారు. 11వ వార్డు డీకేపల్లెలో ప్రతిపాదిత బోరుబావికి అవసరమైన పరికరాలు (రూ.4,21,050), కుప్పం మున్సిపాలిటీలో వివిధ సామర్థ్యాలు కలిగిన పంపుసెట్ల నిర్వహణకు (రూ.4,12,725), కుప్పం మున్సిపాలిటీలో 50 ఎంఎం డయా జీఐ పైపులు, బోర్ క్లాంప్స్ సరఫరాకు (రూ.4,21,098) తదితర 32 పనులకు టెండర్లు ఖరారు చేశారు.

● **వేగంగా పనులు:** టెండర్లు పూర్తిచేసి.. పనులను కాంట్రాక్టర్లకు ఇప్పటికే అప్పగించారు. ప్రస్తుతం బోర్ల తవ్వకాలకోసం స్థలాలను గుర్తిస్తున్నారు. మరోవైపు కొత్త పైపులైన్లు వేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పురపాలక సంఘం పరిధిలో పనులు మంజూరైన ప్రాంతాల్లో ఇప్పటికే సర్వే నిర్వహించారు. తాగునీటి సరఫరాకోసం ఉద్దేశించిన మొత్తం 31 పనులు పూర్తయితే మున్సిపాలిటీ తాగునీటి సమస్య దాదాపు పరిష్కారం కానుంది. నిజానికి వేసవి ప్రారంభం కావడానికి ముందే ఈ పనులు పూర్తి చేయాలనుకున్నా, అనివార్య కారణాలతో పెండింగులో పడ్డాయి. కనీసం ఈ నెలాఖరులోగానైనా ఆయా పనులు పూర్తి చేస్తే వేసవిలో తాగునీటి ఎద్దడి నుంచి బయటపడవచ్చని ప్రజలు ఆశిస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. వారం పదిరోజుల్లో మొత్తం పనులన్నింటినీ పూర్తి చేస్తామని చెప్పారు. మరీ అవసరమైతే తాగునీటి ట్యాంకర్లను కూడా సరఫరా చేయడానికి సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడులు



ముద్దురామాపురం వద్ద ధ్వంసమైన వరి పంటను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

యాదమరి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. యాదమరి మండలం రాచూరు, సిద్ధారెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి వరుసగా పంట పొలాలపై ఏనుగులు దాడులు చేసి విధ్వంసం సృష్టించాయి. యాదమరి సరిహద్దుల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపులో 14 ఏనుగుల గుంపు రాచూరు బీట్ సిద్ధారెడ్డిపల్లె పంచాయతీ ముద్దురామాపురం గ్రామానికి చెందిన రైతు అయ్యాస్వామి రెడ్డికి చెందిన వరిపంట, పలువురు రైతులకు చెందిన వరి, మిరప, టెంకాయ చెట్లను తొక్కి నాశనం చేశాయి. రాత్రివేళల్లో పంట పొలాలపై దాడికి దిగుతుండడంతో సమీపంలో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీ సిబ్బంది ట్రాకర్ల ద్వారా బాణసంచా పేల్చి అడవిలోకి మళ్లించే ప్రయత్నం చేశారు.

బంగారుపాళ్యం: మండలంలోని బోడబండ్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, గోవిందు, సురేష్‌లకు చెందిన వరి, రాగి పంటలను సోమవారం రాత్రి ధ్వంసం చేశాయని రైతులు తెలిపారు. యాదమరి అటవీ ప్రాంతంలో గుంపులో ఉండే ఈ మూడు ఏనుగులు విడిపోయి బోడబండ్ల అటవీ ప్రాంతానికి చేరుకున్నాయని తెలిపారు. తమ పంట పొలాలను ఏనుగు దాడుల నుండి కాపాడాలని అధికారులను రైతులు కోరుతున్నారు.



ఏనుగులు తొక్కేసిన రాగి పంటను చూపుతున్న శ్రీనివాసులు

వైసీపీ భక్త ఎస్‌ఐ నరసింహులు సస్పెన్షన్

సోమలలో చేసిన అరాచకాలు వెలుగులోకి.. ● ప్రస్తుతం కర్నూలులో విధులు



చిత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పలువురు పోలీసు అధికారులు కండువా వేసుకోని వైసీపీ నాయకుల్లా పనిచేసిన విషయం తెలిసిందే. పుంగనూరు నియోజకవర్గంలో అయితే మరీ ఏకపక్షంగా పనిచేశారు. టీడీపీ శ్రేణులే లక్ష్యం చేసుకుని అక్రమ కేసులు, హత్యాయత్నం కేసుల్ని నమోదు చేసి ఇబ్బంది పెట్టిన పూర్వ సోమల ఎస్‌ఐ నరసింహులు తాజాగా సస్పెండ్ అయ్యారు. ఈమేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ తాజాగా ఉత్తర్వులు విడుదల చేశారు. వైసీపీ హయాంలో పెద్దఎత్తున అరాచకాలు చేసిన అతను తెలివిగా ప్రభుత్వం మారిన వెంటనే బదిలీ చేసుకుని కర్నూలు జిల్లా ఆస్పరి స్టేషన్‌కు వెళ్లారు. కానీ, అతను సోమలలో చేసిన అరాచకాలు వెలుగులోకి రావడం, రికార్డెడ్‌గా ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు వేటు వేశారు. సస్పెన్షన్ ఉత్తర్వుల్లో కూడా అతడిపై వచ్చిన ఆరోపణల్ని ప్రస్తావించారు.

వివరాలిలా..

● సెప్టెంబరు 2023లో భార్యాభర్తలు గొడవపడి సోమల స్టేషన్‌కు వచ్చారు. అప్పటి ఎస్‌ఐ నరసింహులు సదరు మహిళ నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. ఆ మహిళ డబ్బులు లేవని చెప్పడంతో కానిస్టేబుల్ ద్వారా పాన్ బ్రోకర్‌ని స్టేషన్‌కు పిలిచారు. ఆమె తాళిబొట్టును తాకట్టు పెట్టి రూ.60వేలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో ఉంది.

● 2023లో సోమలలో 213 ఎఫ్‌ఐఆర్ నెంబరుతో నమోదైన కేసులో యువరాజా నాయుడిని స్టేషనుకు పిలిచి దారుణంగా తిట్టడంతోపాటు తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించిన వీడియో వైరల్ అయింది.

● 2023 డిసెంబరులో కమ్మపల్లెలో సంఘమిత్ర తొలగింపు విషయంగా ఘర్షణలు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే మహిళలను వైసీపీ వర్గీయులు కొట్టారు. మగాళ్ల దుస్తులు చించేసి మరీ దాడి చేశారు. స్థానికులు వీడియోలు తీస్తుంటే ఎస్‌ఐ లాక్కున్నారు. టీడీపీ మద్దతుదారులపై హత్యాయత్నం కేసులు పెట్టిన ఎస్‌ఐ, వైసీపీ వారిపై నామమాత్రంగా బెయిలబుల్ కేసులు పెట్టారు. టీడీపీ వాళ్ల ఫిర్యాదుల్ని పట్టించుకోలేదు.

● ఓ గ్రామంలో వైసీపీ నేత వద్ద రూ.లక్ష లంచం తీసుకుని వారం రోజుల్లో ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లే ఓ యువకుడి మీద అక్రమ కేసు పెట్టి పైశాచిక ఆనందం పొందినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.

● చెన్నైలో స్థిరపడిన ఓ డాక్టర్‌కు అతని బంధువుల మధ్య ఏర్పడిన భూసమస్యను పరిష్కరిస్తానని రూ.లక్ష లంచం తీసుకుని పట్టించుకోలేదని తెలుస్తోంది.

● పెద్దిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు ఓ సందర్భంలో టీడీపీ అధినేత రామచంద్రయాదవ్‌పై తన స్టేషన్‌లోనే నోరు పారేసుకున్న విషయం తెలిసిందే.

కొమరగుంట క్రాస్‌లో స్వల్ప ఉద్రిక్తత

బిడ్డ మృతదేహం సమయానికి రాలేదంటూ కుటుంబీకుల రాస్తారోకో

ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసుల రంగప్రవేశం - పెద్దల పంచాయితీతో అంత్యక్రియలు పూర్తి



ఆందోళనకారులకు సర్దిచెబుతున్న సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కొమరగుంటకు చెందిన జి.మహేష్ అలియాస్ మహేష్‌కుమార్‌రెడ్డి(30) హైదరాబాదులో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున తమ బిడ్డ మృతదేహం గ్రామానికి వస్తుందని కుటుంబీకులకు సమాచారం అందింది. ఉదయమైనా రాకపోవడంతో మృతదేహం అప్పగించాలంటూ కొమరగుంట క్రాస్ వద్ద వెదురుకుప్పం-పచ్చికాపల్లం రహదారిపై బంధువులు, గ్రామస్తులు రాస్తారోకోకు దిగారు.



స్తంభించిన ట్రాఫిక్

ఇంతలో అంబులెన్స్ వచ్చింది. అందులో మృతదేహం కనిపించడం లేదంటూ అంబులెన్స్ అద్దాలు ధ్వంసం చేశారు. మృతదేహాన్ని చూపించాక మృతుడి భార్యను అప్పగించాలంటూ రాస్తారోకో కొనసాగించారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు సర్దిచెప్పినా వినలేదు. రెండుగంటలపాటు విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కల్గించడం సరికాదంటూ ఆందోళనకారులను రోడ్డుపైనుంచి పక్కను పంపించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ సందర్భంగా పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగడంతో తోపులాట జరిగింది. కార్వేటినగరం పోలీసుస్టేషన్‌కు చెందిన హోంగార్డు యువరాజ్ కిందపడి సొమ్మసిల్లారు. ఆయన్ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

పెద్దల పంచాయితీతో సర్దుబాటు

మృతుడి భార్యను అప్పగించి, ఆమెకు అత్తింటి వారి ఆస్తులకు, ఇకపై ఎలాంటి సంబంధం లేదని స్టాంపు పత్రాలపై రాసి ఇవ్వాలని, అలాగే ఆమె తాళిని ఇచ్చేయాలని ఆందోళనకారులు భీష్మించుకున్నారు. సాయంత్రం వరకు ఎటూ తేలలేదు. చివరకు మృతుడి భార్యకు విషయం చెప్పి.. పెద్దలు పంచాయితీ చేయడంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. ఆ తర్వాత ఆందోళన విరమించి.. మహేష్ మృతదేహాన్ని కొమరగుంటకు తీసుకెళ్లి సాయంత్రం అంత్యక్రియలు పూర్తి చేశారు.

పోలీసు బలగాల మొహరింపు

కొమరగుంటలో గొడవలు జరిగే అవకాశం ఉందని పోలీసు యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంది. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐలు వెంకటసుబ్బయ్య (వెదురుకుప్పం), రాజ్‌కుమార్(కార్వేటినగరం), చిన్నరెడ్డెప్ప(పాలసముదం), సుమన్(ఎస్‌ఆర్ పురం)తోపాటు సుమారు ఇరవై మంది పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. ఎస్టీఎఫ్ బలగాలనూ రప్పించారు. అంత్యక్రియలు పూర్తయినా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

హోంగార్డుపై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు



సొమ్మసిల్లిన హోంగార్డు యువరాజ్

తనపై ఆందోళనకారులు దౌర్జన్యానికి పాల్పడి, విధులను ఆటంకం కల్గించారని హోంగార్డు కె.యువరాజ్ ఫిర్యాదు చేయడంతో వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. చంద్రగిరి మండలం శానంబట్లకు చెందిన వంశీసహా మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరికొందరు ఉన్నారని పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు.

రైతన్నకు అండగా ప్రభుత్వం



మామిడి రైతులకు కవర్లు పంపిణీ చేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి తెలిపారు. మంగళవారం బందార్లపల్లె గ్రామ సచివాయలంలో మామిడి రైతులకు రాయితీ ధరకు మామిడి కాయల కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి డింపుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

పలమనేరులో ప్రత్యేకాధికారి తనిఖీలు

పలమనేరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు బాలికోన్నత పాఠశాలను జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి సుధాకర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలను పరిశీలించారు. పాఠశాలలో నీటి సమస్యపై పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. ఎద్దుల సంత వీధిలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఎంఈవో బాలసుందరం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



పుంగనూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వి నియోగం చేసుకోవాలని శ్రీసిటీ కంపెనీ సూపర్‌వెజర్ సంధ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు షార్టుటర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు స్వయం ఉపాధి కోసం ప్రయత్నం చేయాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు టి రాజశేఖర్, టి.శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్ పోస్టుమాస్టర్ అరెస్టు

చౌడేపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సబ్ పోస్టుమాస్టర్ భాస్కర్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తపాలా కార్యాలయంలో సబ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్‌నాయక్ 2019లో సుమారు రూ. లక్ష నిధులు దుర్వినియోగం చేశారని ఉన్నతాధికారులు 2024లో ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సారా విక్రయాలకు పాల్పడితే కేసులు

రామకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంటు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మంగళవారం రామకుప్పం మండలంలో రామాపురం తాండాలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారు వాటికి స్వస్తి చెప్పాలన్నారు. వారికి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. సారా తో కలిగే దుష్పరిణామాలను ఆయన ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారీ, విక్రయాలకు పాల్పడుతుంటే టోల్‌ఫ్రీ నెంబరు 14405 కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ మోహన్‌బాబు, అటవీ ఉపక్షేత్రాధికారి ధనుంజయ, వీఆర్వో యశ్వంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే తనిఖీ



ఇంటింటి సర్వేని తనిఖీ చేస్తున్న జయశంకర్

పలమనేరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ గడ్డూరు కాలనీలో మంగళవారం వైద్యఆరోగ్య సిబ్బంది జ్వరాలపై చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున ప్రజలు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 వరకు ఇంటి వద్దే ఉండాలన్నారు. పనులు చేసేందుకు వెళ్లే వారు తప్పనిసరిగా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. రక్తనమూనాలను పలమనేరు పాతపేట అర్బన్ పీహెచ్‌సీకి పంపాలని వైద్య ఆరోగ్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది సుజాత, భార్గవి, పద్మమ్మ, శోభ పాల్గొన్నారు.

పలమనేరు ఎంఎస్‌సీగా మునిరాజులు



పలమనేరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీ ఎంఎస్‌సీ (మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్)గా స్థానిక న్యాయవాది ఎం.మునిరాజులు నియమితులైనట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమణారెడ్డి తెలిపారు. మునిరాజులు ఎంఎస్‌సీగా నియమితులు కావడం పై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. మూడేళ్లపాటు ఎంఎస్‌సీగా విధులు నిర్వహిస్తారు. ఇకపై మున్సిపాలిటీకి సంబంధించిన కేసులను మునిరాజులు వాదించనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన

పలమనేరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎన్జీవో సంఘం, తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా మంగళవారం పలమనేరులో ఉచితనేత్ర చికిత్సా శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో నేత్ర వైద్యులు 210 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో 60 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి, పెన్షనర్లు, ఎన్జీవో సంఘ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ భరోసా



గుడుపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి బీమా కల్పించి సౌ కర్యం కల్పించి సాయం అందించిన టీడీపీ అధినేత నారా, చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లకు దాసిమానిపల్లె గ్రామానికి చెందిన సుబ్బమ్మతోపాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గుడుపల్లె టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తన భర్త చంద్రయ్య కుప్పిగానిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని.. టీడీపీ సభ్యత్వం పొందడంతో ప్రమాద బీమా పరిహారం రూ.5 లక్షలు అందాయని తెలిపారు. తనకు అండగా ఉన్న స్థానిక నేతలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు బాబునాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, గోపాల్, చంద్రరెడ్డి, రమేష్, గోవిందస్వామి, ప్రకాష్, మంజునాథ్ పాల్గొన్నారు.

పరిశ్రమిస్తే విజయం తథ్యం

వైసీ జేమ్స్ యన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ జగన్నాథరావు తదితరులు

కుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, తగు నైపుణ్యంతో పరిశ్రమిస్తే ఏ రంగంలోనైనా విజయం తథ్యమని వైసీ జేమ్స్ యన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఘనంగా అచీవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో వివిధ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 122 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు చెప్పారు. అత్యధికంగా రూ.9.02 లక్షలు నుంచి రూ.2 లక్షల వరకు వారికి వేతన ప్యాకేజీలు లభించాయన్నారు. ఫైనల్ ఇయర్ సీసీఈ విభాగం విద్యార్థిని వి.తేజశ్రీకి బెంగళూరు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీలో రూ.9.02 లక్షలు వేతనానికి, ఫైనల్ ఇయర్ కంప్యూటర్స్ విభాగం విద్యార్థి కాజు ఒమర్ హైదరాబాదు థాట్ వర్క్స్ కంపెనీలో రూ.8 లక్షలు వేతనానికి ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. కంప్యూటర్స్ విభాగంలో 31 మంది, ఈసీఈ విభాగంలో 54 మంది, ట్రిపుల్‌ఈ విభాగంలో 27 మంది, మెకానికల్ విభాగంలో 10 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులచే నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోపాటు విభాగాధిపతులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



ప్రజావేదికలో డ్వామా పీడీ రవికుమార్‌తో అధికారులు

సోమల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ రవికుమార్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన ఉపాధి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సోమల - నంజంపేట, నెల్లిమంద తదితర రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటినా సగం మొక్కలు లేవని, చనిపోయిన మొక్కలకు నీటి బిల్లులు పంపిణీ చేయడం, క్షేత్ర సిబ్బంది విధుల్లో చేరి ఆరు నెలలైనా జాబ్ కార్డులు అప్‌డేట్ చేయకపోవడంపై పీడీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పలు చోట్ల గృహనిర్మాణాలు పూర్తి చేయకున్నా బిల్లులు పంపిణీ చేయడంపై టెక్నికల్ సిబ్బందిపై మండిపడ్డారు. పూర్తి చేయని పనులకు రికవరీలకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీవీవో శివయ్య, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో దినకర్‌బాబు, ఎస్ఆర్పీ మల్లికార్జున, ఏవో జయప్రకాశ్, జేఈలు అనూష, ఆనంద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పుంగనూరు పోలీస్‌స్టేషన్ ఖాళీ

- సీఐ సస్పెన్షన్, 42 మంది పోలీసులు బదిలీ

పుంగనూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులతో ప్రాణహాని ఉందని ముందే మొరపెట్టుకున్నా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో టీడీపీ కార్యకర్త రామకృష్ణ దారుణ హత్యకు గురయ్యాడు. దీంతో పుంగనూరు పోలీస్‌స్టేషన్ మొత్తం బదిలీలతో ప్రభుత్వం ప్రక్షాళన చేసింది. పోలీసులు చర్యలు తీసుకోనందుకే రామకృష్ణ చనిపోయారని ఏకంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేశ్, అనిత, రాంప్రసాద్‌రెడ్డిలు తీవ్రంగా స్పందించి పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించారు. పుంగనూరు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దిరెడ్డితో పరిచయాలు ఉన్న, గత ప్రభుత్వంలో పని చేసిన పోలీసులు ఉండటంతోనే న్యాయం జరగలేదని హైకమాండ్ భావించింది. రామకృష్ణ హత్య జరిగిన కొన్నిగంటల్లోనే పుంగనూరు సీఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంను డీఐజీ సస్పెండ్ చేశారు.

సోమవారం కేసులో హత్యకు మూల కర్త వెంకటరెడ్డి, హంతకుడు వెంకట్రమణలను అరెస్టు చేయడం, తర్వాత పోలీస్ స్టేషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేస్తూ చిత్తూరు ఎస్పీ మణికంఠ హెడ్‌కానిస్టేబుళ్లు, పోలీసులు మొత్తం 42 మందిని వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేసి బయట ప్రాంతాల వారిని పుంగనూరుకు నియమించారు.

కంటివైద్యశిబిరానికి స్పందన

బైరెడ్డిపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని అగస్తి పబ్లిక్ స్కూల్ ఆవరణలో మంగళవారం మొగసాల అగస్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ రెడ్డెప్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం



పుంగనూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దారుణహత్యకు గురైన రామకృష్ణ కుటుంబ సభ్యులకు పుంగనూరు టీడీపీ నాయకుడు ఆర్బీటీ బాబు (దొమ్మలపాటి నగేశ్‌బాబు) పంపిన రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని మంగళవారం స్థానిక టీడీపీ నాయకులు అందజేశారు. రామకృష్ణ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు అమరనాథ్, రత్న, హరి, రంగయ్య, రాజశేఖర్, నారాయణస్వామి, సోమశేఖర్, మంజుల, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రామకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం మిట్టపల్లెకు చెందిన టీడీపీ యువ నేత నవీన్‌ను కులం పేరిట దూషించి బెదిరించడంపై మండల పరిధి విజలాపురానికి చెందిన వైసీపీ మండలాధ్యక్షుడు వెంటరమణారెడ్డి (విజలాపురం బాబు, రామకుప్పానికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు సెంథిల్‌కుమార్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు. డీఎస్పీ పార్థసారథి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై వేధింపుల కేసు

రామకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించమంటూ ఓ బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని 89పెద్దూరుకు చెందిన మధు(24) ఓ బాలిక(15)ను తనను ప్రేమించాలంటూ గత కొంతకాలంగా వెంటపడుతుండేవాడు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



క్రికెట్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ క్రికెట్ ఆడారు. మంగళవారం నుంచి విజయవాడలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆటవిడుపుకోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రాక్టీస్ సెషన్‌లో గురజాల జగన్మోహన్ ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి క్రికెట్ బ్యాట్ పట్టి ప్రాక్టీస్ చేశారు.

ఘనంగా నారా రామ్మూర్తి నాయుడి జయంతి వేడుకలు



అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకుడు ఎంఎన్ చౌదరి తదితరులు

ఐరాల(కాణిపాకం), మార్చి 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడి జయంతి వేడుకలను మంగళవారం అగరంపల్లె ఆర్చి వద్ద ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో రామ్మూర్తినాయుడి పేరిట పూజలు నిర్వహించిన అనంతరం ఆర్చి వద్ద ఆయన చిత్ర పటానికి పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు ఎంఎన్ చౌదరి మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఐరాల మండలం ఉన్న సమయంలో మండల అభివృద్ధికి రామ్మూర్తినాయుడు ఎంతో కృషి చేశారన్నారు. వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి కూడా పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్‌రావు, ధనంజయ నాయుడు, నరసింహులు నాయుడు, రాజారామ్, చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న జేసీ విద్యాధరి

గుడిపాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పశుపోషణకు కావాల్సిన స్థలాన్ని ఎంపిక చేసేందుకు జేసీ విద్యాధరి, ఆర్డీవో శ్రీనివాసులు మంగళవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయ వెనుకభాగంలో తుమ్మలవారి పల్లి హరిజనవాడ సమీపంలో పరిశీలించారు. పశుపోషణకు కావాల్సిన ఐదెకరాల అనువైన భూమి కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంతి, ఆర్ఐ రామసాయి, వీఆర్వో హేమచంద్రారెడ్డి, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో వేరుశనగలో అధిక దిగుబడి



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త సంధ్యారాణి

తవణంపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతో వేరుశనగ పంటలో అధిక దిగుబడి సాధించవచ్చునని ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని చెర్లోపల్లెలో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్, ఆయిల్ సీడ్ పథకం కింద 30 మంది ఎస్సీ రైతులకు సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ వేరుశనగ సాగులో అధిక దిగుబడి సాధించడానికి చేపట్టాల్సిన విత్తన ఎంపిక, పంట కోత, ఎరువులు వాడకం, కలుపు నివారణ, సస్యరక్షణ, మొక్కల సాంద్రత, జిప్సం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో ప్రవీణ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొత్త బ్రేకర్ ఏర్పాటు



కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గిరింపేట సెక్షన్, బాలాజీ నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పాత బ్రేకర్ స్థానంలో మంగళవారం ఆ శాఖ అధికారులు కొత్త బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయాన్ని నియంత్రించే బ్రేకర్ ఏర్పాటు చేసి 45 ఏళ్లు పైబడడం కారణంగా మార్చినట్లు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈ వాసుదేవరెడ్డి, టౌన్ డీఈ ప్రసాద్, ఏడీ ప్రొటెక్షన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నగరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని నగరి ఎంపీడీవో కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసే ప్రక్రియతో పాటు పంచాయతీ పరిపాలనలో కార్యదర్శుల పాత్ర కీలకమైందని చెప్పారు. వారికి పని ఒత్తిడి తగ్గించాలని ఎంపీడీవో కృష్ణయ్యకు కార్యదర్శుల సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ రాజ్ శాఖకు కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, నిషా, సునీత, పురుషోత్తం, బాబు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం

పెనుమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని అండగా నిలబడిన ప్రభుత్వానికి కృతజ్ఞులమై ఉంటామని రాష్ట్ర చేనేత కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి షణ్ముగవర్మ అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల మేర విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు క్యాబినెట్‌లో ఆమోదం తెలిపినందుకు చేనేతలు చంద్రబాబుకు రుణపడి ఉంటామని అన్నారు.

అవణి పథకంలో నగదు డిపాజిట్ చేస్తే 8.30 శాతం వడ్డీ

గంగాధరనెల్లూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలకోసం ప్రవేశపెట్టిన అవణి పథకంలో నగదును డిపాజిట్ చేస్తే 8.30 శాతంతో వడ్డీ చెల్లించనున్నట్లు గంగాధరనెల్లూరు డీసీసీబీ చీఫ్ మేనేజర్ మంగపట్నం మహేష్ తెలిపారు. స్థానిక బ్యాంక్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీన అవణి డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారని, ఈనెల 31వతేదీ వరకు ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒక్కొక్క మహిళ తమ బ్యాంక్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన అవణి పథకంలో 333 రోజులకుగాను కనిష్ఠంగా రూ.10వేలుకు పైబడి డిపాజిట్‌ను స్వీకరించనున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్ మహిళలకు రూ.8.40శాతంతో వడ్డీ చెల్లించనున్నట్లు చెప్పారు. బ్యాంక్‌లో నగదును డిపాజిట్లను చేసే వారికి డీఐసీజీసీ ఇన్సూరెన్స్ రక్షణ ఉందని తెలిపారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

నింద్ర, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ రైతులకు వివిధ పంటల సస్యరక్షణపై స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలచే మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన శాస్త్రవేత్త మాట్లాడుతూ పంట సస్యరక్షణ, పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హరిప్రసాద్, వ్యవసాయాధికారి తులసీరాం, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

పాలసముద్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజకండ్రిగ కాలనీకి చెందిన మురగయ్య (42) మంగళవారం ఉదయం చింతచెట్టు ఎక్కి కాయలు రాలుస్తుండగా, అదుపుతప్పి కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు తమిళనాడులోని చెన్నై ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్యం అందించారు. చికిత్స పొందుతూ మురగయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పాలసముద్రం హెడ్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వాహనాల తనిఖీ

పాలసముద్రం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పాలసముద్రంలో నగరి ఆర్డీవో గాయత్రి మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. సక్రమంగా రికార్డులు లేని ట్రాక్టర్లు, లారీలకు ఆమె జరిమానా విధించారు. ఆమె మాట్లాడుతూ వాహనదారులు రికార్డులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పక ధరించాలని, లైసెన్స్ లేని వారు డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు.

రైతులు ఈకేవైసీ చేసుకోవాలి

బంగారుపాళ్యం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రైతులు తమ వివరాలను రైతుసేవా కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏడీఏ శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పాలేరులోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. అనంతరం వరి పంటను పరిశీలించి యాజమాన్యపద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, సిబ్బంది చంద్రిక, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విశ్వ సాయిబాబా ఆలయ మహా కుంభాభిషేకం



కుంభాభిషేక సంకల్పం చేస్తున్న ఆలయ ట్రస్టీ సీకే బాబు

చిత్తూరు కల్చరల్, మార్చి 18(ఆంధ్ర జ్యోతి): కట్టమంచి షిరిడీ విశ్వ సాయిబాబా ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పూజల్లో ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతులు పాల్గొని గణపతి, గో, నవగ్రహ, వాస్తు పూజలు, రక్షా బంధనం, వేద పారాయణం నిర్వహించారు. అనంతరం యాగశాల ప్రవేశం, వాస్తుబలి, సంకల్పం చేసి అగ్నిపూజలతో కుంభాభిషేక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు బుధ, గురువారాల్లోనూ జరుగుతాయి. పూజల్లో ఆలయ ట్రస్టీ సీకే బాబు దంపతులు, మేనేజర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు



నగరి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సూచనల మేరకు మంగళవారం సీఐ విక్రమ్ బారికేడ్లను ఏర్పాటు చేశారు. నగరి మున్సిపల్ పరిధిలోని కీళపట్టు వద్ద నగరి-తిరుత్తణి రోడ్డులో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ కోసం బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

సీసీరోడ్డును పరిశీలించిన జడ్పీ సీఈవో

శ్రీరంగరాజపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్లను మంగళవారం జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తనిఖీ చేశారు. ఆయన దిగువ మంగుంట గ్రామం నుంచి మంగుంట గ్రామం వరకు వేసిన సీసీరోడ్డు నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో మోహన మురళి, ఇంజనీర్ అసిస్టెంట్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ

చిత్తూరు అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె సందర్భంగా ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ కూటమి నేతలు అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరించడంతో పాటు వేతనాలను పెంచుతామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం కొన్ని హామీలను ఇచ్చి నెరవేర్చకుండానే దిగిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక సంఘాల నేతలను పిలిపించి అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై చర్చించి, పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, కోశాధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి: ఆర్డీవో



అధికారులతో సమీక్షిస్తున్న పలమనేరు ఆర్డీవో భవాని

బంగారుపాళ్యం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని పలమనేరు ఆర్డీవో భవాని అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో 271 అర్జీలు వచ్చాయని, ఇప్పటి వరకు 228 సమస్యలను పరిష్కరించామని, ఇంకా పరిష్కారం కానీ 41 అర్జీలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో శ్రీధర్, డీటీ కళ్యాణి, ఆర్ఐ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, హరిద్రవం, పసుపు, కుంకుమలతో అభిషేకం చేశారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

మాధవీలతకు డాక్టరేట్



చిత్తూరు సెంట్రల్, మార్చి 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఎస్.మాధవీలతకు తిరుపతి ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'అనాలసిస్ ఆఫ్ ఎయిర్ పొల్యూటెన్స్ డేటా యూజింగ్ డేటా మైనింగ్ టెక్నిక్స్' అనే అంశంపై ప్రొఫెసర్ బి.సరోజమ్మ నేతృత్వంలో చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. మాధవీలతను కళాశాల అధినేత తేజోమూర్తి, అధ్యాపక బృందం అభినందించారు.

సచివాలయాలకు బయోమెట్రిక్ పరికరాలు



ప్రభుత్వం పంపిణీ చేసిన బయోమెట్రిక్ పరికరాలు

గుడిపాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో బయోమెట్రిక్ పరికరాలు లేక సచివాలయ ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఒక్కో పంచాయతీకి ఒక్కో పరికరం ఉండడంతో దానితోనే పింఛన్లు పంపిణీ చేస్తూ చాలా ఇబ్బందులు పడేవారు. పరికరాలు మంజూరు చేయాలని పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని, ఇప్పుడు ప్రభుత్వం మారిన తర్వాత పంచాయతీకి జనాభాను బట్టి నాలుగైదు బయోమెట్రిక్ డివైజ్‌లను పంపిణీ చేశారు. దీంతో ప్రతినెలా పింఛన్లు అందజేయడానికి సులభతరమైందని గ్రామ సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రభుత్వ అండ



రికార్డులు పరిశీలిస్తున్న సహిత విద్య కోఆర్డినేటర్ జయప్రకాష్‌నాయుడు

ఐరాల, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ప్రభుత్వం అండగా ఉంటుందని చిత్తూరు సమగ్ర శిక్ష సహిత విద్య కోఆర్డినేటర్ జయప్రకాష్ నాయుడు అన్నారు. మంగళవారం ఐరాలలోని భవిత కేంద్రాన్ని ఆయన ఎంఈవో రుష్యేంద్రబాబుతో కలసి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు మంచి శిక్షణ ఇస్తారన్నారు. ప్రత్యేక అవసరాలున్న వారిని గుర్తించి వారి పేర్లను భవిత కేంద్రంలో నమోదు చేయించాలన్నారు. సహిత విద్య ఉపాధ్యాయులు సురేష్, కవిత పాల్గొన్నారు.


రుణం ఇప్పిస్తానని మోసం చేశారు



మాట్లాడుతున్న బాధిత మహిళలు

చిత్తూరు సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రుణం ఇప్పిస్తానని చెప్పి తమను ముగ్గురు మహిళలు మోసం చేశారని స్థానిక ఎంజీఆర్ వీధికి చెందిన ధనలక్ష్మి ఆరోపించారు. మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ వీధికి చెందిన ముగ్గురు మహిళలు డ్వాక్రా గ్రూపు సమావేశాల్లో తరచూ మాట్లాడుతూ ఉండేవారమన్నారు. కాగా తాము వ్యాపార నిమిత్తం రుణం కోసం ప్రయత్నిస్తుండగా సదరు ముగ్గురు మహిళలు రుణం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి రూ.4 లక్షల విలువైన నగలు, రూ.4 లక్షల నగదు తీసుకున్నారని ఆరోపించారు. కాజూరుకు చెందిన దేవి మాట్లాడుతూఈ ముగ్గురు మహిళలు తనకు రూ.10 లక్షలు బ్యాంక్ లోన్ ఇప్పిస్తామని చెప్పి, బ్యాంక్ డిపాజిట్ పేరుతో రూ.2 లక్షలు తీసుకుని మోసం చేశారని వాపోయారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వస్తువు నాణ్యతను కనుగొనాలి



విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న హెచ్ఎం కోటేశ్వరరావు

వెదురుకుప్పం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మోసపోకుండా నాణ్యమైన బీఐఎస్ మార్కు కలిగిన వస్తువులను కొనుగోలు చేయాలని, కేర్ యాప్ ద్వారా మొబైల్‌లోనే వస్తు నాణ్యతను కనుగొనవచ్చునని ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం కార్వేటినగరంలోని ఆర్కేఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

రీసర్వే సక్రమంగా నిర్వహించండి



నెట్టేరిలో జరుగుతున్న రీసర్వేను తనిఖీ చేస్తున్న నిషాంత్‌రెడ్డి

నింద్ర, మార్చి 18(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేను తప్పులు లేకుండా సక్రమంగా నిర్వహించాలని నోడల్ అధికారి నిషాంత్ రెడ్డి అన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నింద్ర మండలం నెట్టేరి పంచాయతీలో జరుగుతున్న భూ రీసర్వేను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తప్పులు లేకుండా సక్రమంగా చేయాలని చెప్పారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఆర్ఎస్‌టీ నీలావతి, డీఐ ప్రసాద్‌రావు, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా రీసర్వే చేయండి



రీసర్వేని పరిశీలిస్తున్న నోడల్ అధికారి శాంతరాజన్

పూతలపట్టు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న రీసర్వేలో తప్పుల తడకలు లేకుండా చేయాలని నోడల్ అధికారి శాంతరాజన్ కోరారు. మండలంలోని వడ్డేపల్లి పంచాయతీ పరిధిలో మంగళవారం జరిగిన రీసర్వేని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే చేసేముందు సంబంధిత రైతులకు ముందస్తుగానే నోటీసులు జారీచేయాలన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే చేపట్టాలన్నారు. ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఆరోగ్యం పట్ల అవగాహన

వెదురుకుప్పం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు ఆరోగ్యం పట్ల ఆ మండలంలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి అవగాహన కల్పించారు. అనంతరం వృద్ధులకు బీపీ, షుగర్ టెస్టులు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ భరోసా

గుడుపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి బీమా కల్పించి సౌ కర్యం కల్పించి సాయం అందించిన టీడీపీ అధినేత నారా, చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌లకు దాసిమానిపల్లె గ్రామానికి చెందిన సుబ్బమ్మతోపాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గుడుపల్లె టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. తన భర్త చంద్రయ్య కుప్పిగానిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని.. టీడీపీ సభ్యత్వం పొందడంతో ప్రమాద బీమా పరిహారం రూ.5 లక్షలు అందాయని తెలిపారు. తనకు అండగా ఉన్న స్థానిక నేతలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు బాబునాయుడు, నాయకులు సుబ్రహ్మణ్యం, భానుమూర్తి, గోపాల్, చంద్రరెడ్డి, రమేష్, గోవిందస్వామి, ప్రకాష్, మంజునాథ్ పాల్గొన్నారు.

యువకుడిపై వేధింపుల కేసు

రామకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రేమించమంటూ ఓ బాలికను వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని 89పెద్దూరుకు చెందిన మధు(24) ఓ బాలిక(15)ను తనను ప్రేమించాలంటూ గత కొంతకాలంగా వెంటపడుతుండేవాడు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

సారా విక్రయాలకు పాల్పడితే కేసులు

రామకుప్పం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంటు, ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మంగళవారం రామకుప్పం మండలంలో రామాపురంతాండాలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారు వాటికి స్వస్తి చెప్పాలన్నారు. వారికి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. సారాతో కలిగే దుష్పరిణామాలను ఆయన ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారీ, విక్రయాలకు పాల్పడుతుంటే టోల్‌ఫ్రీ నెంబరు 14405కు సమాచారం ఇవ్వాలన్నారు. కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ మోహన్‌బాబు, అటవీ ఉపక్షేత్రాధికారి ధనుంజయ, వీఆర్వో యశ్వంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్ పోస్టుమాస్టర్ అరెస్టు

చౌడేపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సబ్ పోస్టుమాస్టర్ భాస్కర్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తపాలా కార్యాలయంలో సబ్ పోస్టుమాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ నాయక్ 2019లో సుమారు రూ.లక్ష నిధులు దుర్వినియోగం చేశారని ఉన్నతాధికారులు 2024లో ఫిర్యాదు చేశారన్నారు. ఆ మేరకు విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.